క్లుప్తంగా

బాధ్యతగా మొక్కలు నాటాలి



మొక్కలు నాటుతున్న అటవీశాఖ అధికారులు, విద్యార్థులు

జైపూర్: సామాజిక బాధ్యతగా ప్రతి ఒక్కరూ మొక్కలు నాటి సంరక్షించాలని తెలంగాణ అటవీ అభివృద్ధి సంస్థ డివిజనల్ మేనేజర్ శ్రావణి అన్నారు. మొక్కల పెంపకంతో పర్యావరణ పరిరక్షణ సాధ్యమన్నారు. మండలంలోని పెగడపల్లి సెక్షన్ అటవీ ప్రాంతంలో నీలగిరి ప్లాంటేషన్లో వన మహోత్సవంలో భాగంగా గురువారం మొక్కలు నాటారు. మంచిర్యాల, బెల్లంపల్లి రేంజ్ ప్లాంటేషన్ మేనేజర్ గోగు సురేశ్, సునిత, కుందారం పాఠశాల హెచ్ఎం రామకృష్ణ, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ఉరేసుకుని డిగ్రీ విద్యార్థిని ఆత్మహత్య

జైపూర్: మండలంలోని మిట్టపల్లి గ్రామానికి చెందిన సెగ్గం భాగ్యలక్ష్మి (20) ఉరేసుకుని ఆత్మహత్యకు పాల్పడింది. స్థానికులు తెలిపిన వివరాలు..శ్రీలత–రమేశ్ దంపతులకు కుమారుడు, ఇద్దరు కుమార్తెలు. పెద్ద కుమార్తె భాగ్యలక్ష్మి గతేడాది నిర్మల్ గురుకులాల్లో డిగ్రీ సీటు రాగా, అనారోగ్యం కారణంగా అక్కడి నుంచి వచ్చి మంచిర్యాలలో డిగ్రీ ద్వితీయ సంవత్సరం చదువుతోంది. ఇంట్లో సమస్యలు లేక అనారోగ్యం కారణంగానో కాని గురువారం సాయంత్రం గ్రామ సమీపంలో మామిడి తోటలో చున్నీతో ఉరేసుకుని ఆత్మహత్య చేసుకుంది. స్థానికుల సమాచారంతో ఎస్సై శ్రీధర్ సంఘటనా స్థలానికి చేరుకుని విచారణ చేపట్టారు.

విద్యార్థినులు ఉన్నతంగా రాణించాలి



పుస్తకాలు అందుకున్న విద్యార్థినులతో ఎంపీడీవో, సీఐ

తాండూర్: చదువులో విద్యార్థులు ఉన్నతంగా రాణించాలని ఎంపీడీవో శ్రీనివాస్, తాండూర్ సీఐ కుమారస్వామి అన్నారు. తాండూర్ కేజీబీవీలో చదువుతున్న పదో తరగతి విద్యార్థినులకు గురువారం అభ్యాసదీపికలు పుస్తకాలు అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పక్కా ప్రణాళికతో చదివి ఫలితాలు సాధించాలన్నారు. పాఠశాల చుట్టూ సీసీ కెమెరాలు ఏర్పాటు చేసుకోవాలని సిబ్బందిని ఆదేశించారు. ఎస్సై కిరణ్‌కుమార్, పాఠశాల ఇన్‌చార్జి సుమన చైతన్య, సిబ్బంది పాల్గొన్నారు.

సైబర్ నేరాలపై అప్రమత్తంగా ఉండాలి

చెన్నూర్: సైబర్ నేరాలపై అప్రమత్తంగా ఉండాలని ఎస్సై వెంకటేశ్వర్‌రావు అన్నారు. రామగుండం సీపీ శ్రీనివాసులు ఆదేశాలతో స్థానిక మ హాత్మా జ్యోతిబాపూలే బాలుర ఉన్నత పాఠశాల విద్యార్థులకు సైబర్ నేరాలపై గురువారం అవగాహన కల్పించారు. ఎస్సై మాట్లాడుతూ ఇటీవలకాలంలో సైబర్ నేరాలు పెరిగాయన్నారు. గుర్తుతెలియని మేసెజ్‌లకు స్పందించొద్దన్నా రు. చిన్న చిన్న విషయాలకు కుంగిపోయి ఆత్మహత్యలు చేసుకోవద్దని సూచించారు. బాలికలు, మహిళలను వేధిస్తే కఠిన చర్యలు తీసుకుంటామన్నారు. పాఠశాలలో సీసీ కెమెరాలు ఏర్పాటు చేయాలని సూచించారు. ప్రిన్సిపాల్ కేవీఎం ప్రకాశ్‌రావు పాల్గొన్నారు.

ఒత్తిళ్లకు లోనుకావొద్దు

జన్నారం: విద్యార్థులు చదువుపై దృష్టిసారించి, అనవసరమైన ఒత్తిళ్లకు లోను కావొద్దని ఎస్సై రాజవర్ధన్ అన్నారు. మండలంలోని కస్తూర్బా గాంధీ విద్యాలయంలో విద్యార్థినులకు పలు అంశాలపై గురువారం అవగాహన కల్పించారు. మొబైల్ వాడకాన్ని తగ్గించి చదువుపై శ్రద్ధ పెట్టాలన్నారు. సైబర్‌నేరాలపై అప్రమత్తంగా ఉండాలన్నారు. సమావేశంలో పాఠశాల ఎస్వో శ్రీవాణి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

సీసీ కెమెరాలు తప్పనిసరి

కోటపల్లి: ప్రభుత్వ పాఠశాలలు, వసతి గృహాల్లో సీసీ కెమెరాలు తప్పనిసరిగా ఏర్పాటు చేసుకోవాలని సీఐ సుధాకర్ అన్నారు. కోటపల్లి కస్తూర్బాగాంధీ బాలికల పాఠశాలను ఎస్సై రాజేందర్‌తో కలిసి సందర్శించి సీసీ కెమెరాల పనితీరు పరిశీలించారు. ఎస్వో హరిత, ఉపాధ్యాయులు ఉన్నారు.

వసతి గృహంలో వైద్యశిబిరం

లక్సెట్టిపేట: మండలంలోని వెంకట్రావుపేట పీహెచ్‌సీ ఆధ్వర్యంలో స్థానిక బీసీ వసతి గృహంలో గురువారం వైద్య శిబిరం నిర్వహించారు. విద్యార్థులకు వైద్యపరీక్షలు పరీక్షలు నిర్వహించి మందులు పంపిణీ చేశారు. వర్షాకాలంలో వ్యక్తిగత పరిశుభ్రత పరిసరాలను శుభ్రంగా ఉంచుకోవాలని తెలిపారు. వైద్యాధికారులు సతీశ్, హెచ్ఈవో లక్ష్మణ్‌స్వామి, వార్డెన్ శ్రీహరి, సిబ్బంది, ఆశవర్కర్లు పాల్గొన్నారు.

మరింత చేరువగా..

- జిల్లాకు కొత్తగా మరో 20 మీ సేవ కేంద్రాలు మంజూరు
- మహిళా సంఘాలతో ఏర్పాటుకు కసరత్తు



దండేపల్లి: మీసేవ కేంద్రాల ద్వారా అందించాల్సిన సేవలను ప్రజలకు మరింత చేరువ చేసేందుకు ప్రభుత్వం ఏర్పాట్లు చేస్తోంది. పట్టణాలు, మండల కేంద్రాలు, మేజర్ గ్రామాలకు పరిమితమైన మీసేవ కేంద్రాలను అత్యవసరమున్న పల్లెల్లోనూ ఏర్పాటు చేయాలని నిర్ణయించింది. కొత్తగా మంజూరు చేసే మీసేవ కేంద్రాలను మహిళా సంఘాలకు కేటాయించనున్నారు. వివిధ ధ్రువపత్రాలు, ఆధార్ సేవల కోసం గ్రామీణ ప్రాంత ప్రజలు పట్టణాలు, మండల కేంద్రాలకు వెళ్లాల్సి వస్తుంది. దీన్ని దృష్టిలో పెట్టుకుని గ్రామీణ ప్రాంతాల్లోనూ మీసేవ కేంద్రాలు ఏర్పాటు చేయాలని ప్రభుత్వం కసరత్తు చేస్తోంది.

జిల్లాలో ప్రస్తుతం 151 కేంద్రాలు

మంచిర్యాల జిల్లాలో ప్రస్తుతం 151 మీసేవ కేంద్రాలు కొనసాగుతున్నాయి. వీటిలో అత్యధికంగా పట్టణాలు, మండల కేంద్రాల్లోనే ఉన్నాయి. ప్రభుత్వ పథకాలు పొందాలన్నా ఇతర సేవలకు దరఖాస్తులు చేసుకోవాలన్నా మీసేవ ధ్రువపత్రాలు అవసరమవుతాయి. మీసేవ కేంద్రాల సంఖ్య తక్కువగా ఉండటంతో, కొన్నిచోట్ల కేంద్రాలు రద్దీగా కనిపిస్తుంటాయి. ప్రజల అవసరాలను ఆసరాగా చేసుకుని కొన్నిచోట్ల వివిధ డాక్యుమెంట్ల పేరుతో, కొందరు నిర్వాహకులు అధిక మొత్తంలో డబ్బులు వసూళ్లు చేస్తున్నారనే ఆరోపణలు వ్యక్తమవుతున్నాయి. మరికొన్నిచోట్ల దూరభారంతో ప్రజలు ఆర్థికంగా నష్టపోతున్నారు. ప్రభుత్వ తాజా నిర్ణయంతో గ్రామీణప్రాంత ప్రజలకు మీసేవ కేంద్రాలు మరింత చేరువ కానున్నాయి.

కొత్తగా 20 కేంద్రాలు మంజూరు

మహిళా శక్తి పథకం కింద అర్హులైన స్వయం సహాయక సంఘాల సభ్యులకు మీసేవ కేంద్రాలను ప్రభుత్వం కేటాయించనుంది. ఇందులో జిల్లాకు తొలి విడతలో 20 మీ సేవ కేంద్రాలను మంజూరు చేసింది. లబ్ధిదారులకు ఒక్కో కేంద్రానికి రూ.2.50 లక్షల చొప్పున స్త్రీనిధి ద్వారా గ్రామీణాభివృద్ధి శాఖ రుణాలు మంజూరు చేస్తోంది. మీసేవ కేంద్రాలు ప్రారంభమైన తర్వాత తీసుకున్న రుణాలు తిరిగి చెల్లించాల్సి ఉంటుంది. ఇంటర్ పాసైన సభ్యులను ఆపరేటర్లుగా ఎంపిక చేస్తుంది. వీరికి మీసేవ సంస్థ ద్వారా శిక్షణ కూడా ఉంటుంది. ఆగస్టులో కేంద్రాలను ప్రారంభించే దిశగా ప్రభుత్వం కసరత్తు చేస్తుంది.

సంఘాలకు బాధ్యతలు

స్వయం సహాయక సంఘాలకు, మహిళా శక్తి పథకం ద్వారా మీసేవా కేంద్రాల నిర్వహణ బాధ్యతలు అప్పగించింది. ఇందుకు సంబంధించిన ప్రక్రియ మొదలైంది. తొలి విడతలో 20 కేంద్రాలు మంజూరయ్యాయి. వీటి ఏర్పాటుతో మారుమూల గ్రామాల ప్రజలకు సేవలు మరింత చేరువ కానున్నాయి. – కిషన్, డీఆర్డీవో

కొత్తగా మంజూరైన మీసేవ కేంద్రాలు ఇవే..

మండలం	గ్రామం				
బెల్లంపల్లి	ఆకెనిపల్లి	హాజీపూర్	గడ్‌పూర్	కోటపల్లి	మల్లంపేట్
బెల్లంపల్లి	బుదాకలాన్	హాజీపూర్	ర్యాలీ	కోటపల్లి	పార్‌పల్లి
బెల్లంపల్లి	అంకుశమ్	హాజీపూర్	వేంపల్లి	మందమర్రి	బొక్కలగుట్ట
చెన్నూర్	దుగ్నెపల్లి	కాసిపేట	ధర్మరావ్‌పేట	మందమర్రి	మామిడిగట్టు
చెన్నూర్	కిష్టంపేట	కాసిపేట	సోమగూడ(కే)తండా	నెన్నెల	గొలిపల్లి
చెన్నూర్	పొక్కూర్	కాసిపేట	పల్లిమడుగు	నెన్నెల	ఘన్‌పూర్
		కోటపల్లి	దేవులవాడ	నెన్నెల	మెట్‌పల్లి

కట్ట, మత్తడి ఎత్తు పెంపుతో ముంపు



భూమి పట్టాలు, నక్ష చూపిస్తున్న భార్యాభర్తలు

బెల్లంపల్లి: ప్రైవేట్ కుంటకు అధికారులు నిధులు వెచ్చించి కట్ట, మత్తడి పెంచడంతో తన పట్టా భూమి ఏటా ముంపునకు గురవుతోందని తాండూర్ మండలం ద్వారకాపూర్‌కు చెందిన రైతు పులిశెట్టి సత్తయ్య తెలిపారు. బెల్లంపల్లి ప్రెస్‌క్లబ్‌లో గురువారం తన భార్య స్వర్ణరేఖతో కలిసి మాట్లాడారు. ద్వారకాపూర్ పంచాయతీ పరిధి రాంపూర్ శివారు సర్వే నెంబర్ 68/ఆ లో తనకు వ్యవసాయ భూమి ఉందన్నారు. ఆ ప్రాంతంలో అధికారులు మిషన్ కాకతీయ పథకం నిధులతో 5 ఫీట్ల ఎత్తులో కట్ట, 3 ఫీట్ల ఎత్తులో మత్తడి నిర్మించారన్నారు. వర్షాకాలంలో వరదనీరు చేరడంతో పట్టా భూమి ముంపునకు గురవుతోందన్నారు. ఏటా దాదాపు 3.11 ఎకరాల వరకు భూమి నీట మునిగిపోతోందని ఆవేదన వ్యక్తం చేశారు. సర్వే నెంబర్ 32లో రాంపూర్ చెరువు ఉందని శిఖం భూమి 10.36 ఎకరాలు ఉండగా ఆ ప్రాంతంలో కుంట నిర్మాణం చేయాల్సి ఉండగా అధికారులు అవగాహన లేక ప్రైవేట్‌కుంట కట్ట, మత్తడి ఎత్తును పెంచారన్నారు. తన భూమి నీట మునగకుండా నెలల క్రితం మట్టిని తీసుకు వచ్చి పోసుకున్నట్లు వివరించారు. అయితే, నీటి పారుదల అధికారులు తనపై అక్రమంగా కేసు పెట్టి ఇబ్బందులకు గురిచేస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు.

బ్యాంకు సేవలు సద్వినియోగం చేసుకోవాలి



అవగాహన కల్పిస్తున్న రాజేశ్వర్‌రెడ్డి

మందమర్రిరూరల్: హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంకు సేవలు సద్వినియోగం చేసుకోవాలని ఎస్వో టూ జీఎం రాజేశ్వర్‌రెడ్డి కోరారు. ఏరియాలోని కాన్ఫరెన్స్ హాల్‌లో ఏరియా అధికారులకు గురువారం నిర్వహించిన అవగాహన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. హెచ్‌డీఎఫ్‌సీలో ఖాతా ఉన్న కార్మికుడు ప్రమాదంలో మృతి చెందితే రూ. 20 లక్షల ప్రమాదబీమా వర్తిస్తుందన్నారు. అదేవిధంగా డెబిట్‌కార్డు నెలలో ఒకసారి వినియోగించినా రూ.10 లక్షల అదనపు బీమా ప్రయోజనం పొందవచ్చునని అన్నారు. 18 ఏళ్ల లోపు చదువుకునే పిల్లలకు రూ.4 లక్షల ఆర్థికసాయం, ప్రమాదంలో అంగవైకల్యం పొందితే రూ.20 లక్షల ప్రమాద బీమా, అనారోగ్య కారణాలతో ఆస్పత్రిలో చేరితే చికిత్స సమయంలో రోజు రూ.వెయ్యి చొప్పున 15 రోజుల వరకు ఆర్థికసాయం అందుతుందన్నారు. సింగరేణి సంస్థకు హెచ్‌డీఎఫ్‌సీ మధ్య అవగాహన ఒప్పందాన్ని కాంట్రాక్ట్ కార్మికులకు వివరించాలన్నారు. కార్యక్రమంలో ఏరియా పర్సనల్ మేనేజర్ శ్యాంసుందర్, సీనియర్ పీవో విక్రాంత్, డీవైపీఎం ఆసిఫ్, గనుల సంక్షేమాధికారులు పాల్గొన్నారు.

నోట్‌బుక్‌లు, పెన్నుల పంపిణీ

కాసిపేట: కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్ జన్మదినాన్ని పురస్కరించుకొని మండలంలోని వెంకటాపూర్ ప్రాథమిక పాఠశాల విద్యార్థులకు బీజేపీ మండల అధ్యక్షుడు సంపత్‌కుమార్ ఆధ్వర్యంలో గురువారం నోట్‌బుక్‌లు, పెన్నులు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా రామాలయంలో పూజలు నిర్వహించారు. మండల ప్రధాన కార్యదర్శులు ప్రసన్న, రెడ్డి బాలరాజు, ఉపాధ్యక్షుడు శంకర్, బీజేవైఎం మండల అధ్యక్షుడు తిరుపతి, నాయకులు సాయివంశీ, అనిల్, సతీష్, సన్నీ, బూత్ అధ్యక్షుడు శ్రీనివాస్ పాల్గొన్నారు.

బోనమెత్తి..పోచమ్మకు మొక్కి..



దండేపల్లి: ఊరేగింపుగా వెళ్తున్న మహిళలు, భక్తులు



నస్పూర్: ఊరేగింపుగా వెళ్తున్న భక్తులు

దండేపల్లి: మండలంలోని మేదరిపేటలో గురువారం పోచమ్మ బోనాల వేడుకలను ఘనంగా నిర్వహించారు. మహిళలు ఇళ్లలో బోనాలు వండి, నెత్తిన పెట్టుకుని, డప్పుచప్పుళ్లతో ఊరేగింపుగా ఆలయానికి వెళ్లారు. ప్రత్యేక పూజలు అనంతరం పోచమ్మ తల్లికి బోనాలు సమర్పించి మొక్కు చెల్లించుకున్నారు. చింతపల్లిలో గ్రామదేవతలకు ప్రత్యేక పూజలు చేశారు.

ఘనంగా బోనాల జాతర

నస్పూర్: వారసంత వర్తక సంఘం ఆధ్వర్యంలో గురువారం ఆషాఢమాసం బోనాల జాతరను ఘనంగా నిర్వహించారు. భక్తులు బోనాలు నెత్తిన పెట్టుకుని శివసత్తుల పూనకాలతో, డప్పుచప్పుళ్ల మధ్య సీసీసీ కార్నర్‌లోని నర్సయ్య భవన్ నుంచి సుందరయ్య కాలనీలోని వారసంత వద్ద గల మైసమ్మ ఆలయానికి చేరుకున్నారు. అమ్మవారికి బోనాలు సమర్పించి మొక్కులు చెల్లించుకున్నారు. వర్తక సంఘం అధ్యక్షురాలు బియ్యాల లలిత, ప్రధాన కార్యదర్శి ధర్ని రాజు, ఉపాధ్యక్షురాలు శశికళ, కోశాధికారి ఆకుల కోమల పాల్గొన్నారు.

బ్యాంకుల తనిఖీ



తాండూర్: సీసీ పుటేజీని పరిశీలిస్తున్న ఎస్సై

తాండూర్: మండల కేంద్రంలో ఉన్న ప్రభుత్వ రంగ బ్యాంకులను ఎస్సై కిరణ్‌కుమార్ ఆధ్వర్యంలో గురువారం పోలీసులు ఆకస్మికంగా తనిఖీ చేశారు. అనుమానాస్పదంగా కనిపించిన వ్యక్తుల వివరాలను అడిగి తెలుసుకుని సోదాలు చేశారు. బ్యాంకుల వద్ద భద్రత ఏర్పాట్లు, సీసీ కెమెరాలు, అత్యవసర పరిస్థితుల్లో పనిచేసే అలారం సిస్టం పనితీరును ఎస్సై పరిశీలించారు. బ్యాంకు అధికారులు, సిబ్బందితో మాట్లాడారు. అనుమానితులు వచ్చినట్లైతే సమాచారం ఇవ్వాలని సూచించారు.

నస్పూర్: పట్టణ పరిధిలోని అన్ని బ్యాంకుల వద్ద సీసీసీ నస్పూర్ ఎస్సై సుగుణాకర్ తన సిబ్బందితో కలిసి గురువారం ఆకస్మిక తనిఖీ చేశారు. బ్యాంకుల వద్ద సీసీ కెమెరాల పనితీరు, ఎమర్జెన్సీ అలారమ్ సిస్టంల పనితీరును పరిశీలించారు. అనుమానిత వ్యక్తులను తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బ్యాంకుల వద్ద, ఏటీఎంల వద్ద దొంగతనాలు జరుగకుండా ప్రతిఒక్కరూ అప్రమత్తంగా ఉండాలని సూచించారు. అనుమానితులు కనిపిస్తే 100 డయల్‌కు సమాచారం ఇవ్వాలన్నారు. బ్లూకోర్ట్, సిబ్బంది పాల్గొన్నారు.

మాజీ ఎమ్మెల్యేను కలిసిన మాజీ మంత్రి



గోవింద్‌నాయక్‌తో మాజీ మంత్రి, బంజారా సేవాసమితి నాయకులు

దండేపల్లి: ఖానాపూర్ మాజీ ఎమ్మెల్యే గోవింద్ నాయక్‌ను మండలంలోని లింగాపూర్‌లోని ఆయన ఇంటి వద్ద మాజీ మంత్రి సత్యవతిరాథోడ్, మాజీ ఎంపీ సీతారాంనాయక్, ట్రైకార్ మాజీ చైర్మన్ జాన్సన్‌నాయక్ గురువారం కలిశారు. వృద్ధాప్యంతో ఇంటి వద్దే ఉంటున్న గోవింద్‌నాయక్ యోగాక్షేమాలను అడిగి తెలుసుకున్నారు. ఆలిండియా బంజారా సేవాసమితి గురించి ఆయనతో చర్చించి, సలహాలు, సూచనలు తీసుకున్నారు. వారితోపాటు సేవాసమితి చైర్మన్ రాంచందర్‌నాయక్, అసోసియేట్ అధ్యక్షుడు మోహన్‌సింగ్, వర్కింగ్ ప్రెసిడెంట్ దీప్లాచౌహాన్, నాయకులు తిరుపతినాయక్, భాస్కర్‌నాయక్, గోవింద్, లక్ష్మణ్‌నాయక్ తదితరులు పాల్గొన్నారు.

టీఎన్జీవోస్ హౌసింగ్ సొసైటీ సమస్యలపై వినతి



ఎమ్మెల్యేకు వినతిపత్రం అందిస్తున్న సభ్యులు

మంచిర్యాలటౌన్: టీఎన్జీవోస్ హౌసింగ్ సొసైటీ ఆధ్వర్యంలో నస్పూర్‌లోని 42 సర్వే నంబరులో చేపట్టిన ఇళ్ల నిర్మాణ పనులు మధ్యలో నిలిపివేయడం జరిగిందని సొసైటీ సభ్యులు తెలిపారు. సమస్యలను పరిష్కరించాలని మంచిర్యాల ఎమ్మెల్యే కొక్కిరాల ప్రేమ్‌సాగర్‌రావుకు గురువారం సాయంత్రం వినతిపత్రం అందించారు. ఈ సందర్భంగావారు మాట్లాడుతూ మున్సిపల్ పర్మిషన్ తీసుకుని, ఇంటి నిర్మాణ పనులను ప్రారంభించినా మధ్యలో నిలిపి వేశారని తెలిపారు. వాటిని త్వరగా పూర్తి చేసేలా చూడాలని కోరారు. దీనికి ఎమ్మెల్యే సానుకూలంగా స్పందించారని తెలిపారు. వారం రోజుల్లోపు సమస్యలు పరిష్కరించి నిర్మాణ పనులు మొదలయ్యేలా చూస్తానని హామీ ఇచ్చినట్లు వెల్లడించారు. కార్యక్రమంలో టీఎన్జీవోస్ సొసైటీ జిల్లా అధ్యక్షుడు శ్రీహరి, కార్యదర్శి హబీబ్ హుస్సేన్, సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

న్యాయవాదుల విధుల బహిష్కరణ



బెల్లంపల్లి: రాస్తారోకో చేస్తున్న న్యాయవాదులు



లక్సెట్టిపేటలో బహిష్కరిస్తున్న న్యాయవాదులు



మంచిర్యాలలో న్యాయవాదుల నిరసన

మంచిర్యాలక్రైం/బెల్లంపల్లి/లక్సెట్టిపేట: సిద్దిపేటలో న్యాయవాది రవికుమార్‌పై దాడి చేసిన ఏఎస్సైపై చర్యలు తీసుకోవాలని న్యాయవాదులు డిమాండ్ చేశారు. మంచిర్యాల కోర్టు సమీపంలో రహదారిపై జిల్లా బార్ అసోసియేషన్ ఆధ్వర్యంలో గురువారం విధులు బహిష్కరించి నిరసన తెలిపారు. ఏఎస్సైని కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేశారు. ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా చూడాలన్నారు. బార్ అసోసియేషన్ అధ్యక్షుడు జగన్, సభ్యులు, న్యాయవాదులు పాల్గొన్నారు. బెల్లంపల్లి జూనియర్ సివిల్ కోర్టు ముందు ఉన్న ప్రధాన రహదారిపై న్యాయవాదులు అరగంటపాటు రాస్తారోకో చేపట్టారు. వాహనాల రాకపోకలను స్తంభింపజేశారు. న్యాయవాదులు చేను రవికుమార్, సింగతి రాజేష్, నల్లుల సంగీత, శ్రీనివాస్, సునీల్ తదితరులు పాల్గొన్నారు. లక్సెట్టిపేట మున్సిఫ్ మెజిస్ట్రేట్ కోర్టు న్యాయవాదులు విధులు బహిష్కరించి నినాదాలు చేశారు. బార్ అసోసియేషన్ అధ్యక్షుడు కిరణ్‌కుమార్, సీనియర్, జూనియర్ న్యాయవాదులు తదితరులు పాల్గొన్నారు.

సంక్షిప్త వార్తలు

అంగన్‌వాడీ కేంద్రం తనిఖీ



వివరాలు తెలుసుకుంటున్న ఎంపీడీవో

భీమారం: మండలంలోని బూర్గుపల్లి అంగన్‌వాడీ కేంద్రాన్ని ఎంపీడీవో రాధారాథోడ్ గురువారం తనిఖీ చేశారు. ఈ సందర్భంగా కేంద్రంలో రికార్డులను పరిశీలించారు. పిల్లల ఎంతమంది ఉన్నారని టీచర్‌ని అడిగి తెలుసుకున్నారు. మెనూ ప్రకారం పౌష్టికాహారం అదించాలన్నారు. కాగా భవనం మరమ్మతుకు నిధులు మంజూరయ్యాయని, పనులు చేపడుతామని ఎంపీడీవో తెలిపారు. ఐసీడీఎస్ సూపర్‌వైజర్ రజిత, సిబ్బంది ఉన్నారు.

మోడల్ హాస్టల్ సందర్శన



వివరాలు తెలుసుకుంటున్న డీఆర్‌డీవో

మందమర్రిరూరల్: మండల కేంద్రంలోని మోడల్ స్కూల్‌లోని హాస్టల్‌ను డీఆర్‌డీవో కిషన్ గురువారం సందర్శించారు. గదుల్లో ఫ్యాన్, తలుపులు, పిల్లలకు తాగునీటి వసతి తదితర అవసరాలు, సదుపాయాలపై గురించి వార్డెన్‌ను అడిగి తెలుసుకున్నారు. త్వరలో మరమ్మతు చేయిస్తామని డీఆర్‌డీవో తెలిపారు. ఆయన వెంట ఎంపీడీవో రాజేశ్వర్, ప్రిన్సిపాల్ జయకృష్ణారెడ్డి ఉన్నారు.

సన్మానం

దండేపల్లి: రాష్ట్ర గిరిజన కోఆపరేటివ్ ఫైనాన్స్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ చైర్మన్‌గా నియమితులైన కోట్నాక తిరుపతిని దండేపల్లి మండలం అల్లీపూర్‌లో ఆయన స్వగృహంలో పలువురు కాంగ్రెస్ నాయకులు గురువారం కలిశారు. ఈ సందర్భంగా ఆయన్ను శాలువాలతో సత్కరించారు. కార్యక్రమంలో మాజీ వైస్ఎంపీపీ రాజేందర్, మాజీ సర్పంచ్ లచ్చుపటేల్, మాజీ ఉపసర్పంచులు తిరుపతి, రాజయ్య, నాయకులు దయాకర్, శంకర్,భగవంతరావు, కుమార్, సాధిక్, తిరుపతి, రవి పాల్గొన్నారు.

ఎంపీటీసీ–2కి సన్మానం

జైపూర్: ఐదేళ్ల కాలంలో ఇందారం ఎంపీటీసీ–2 స్వర్ణసంతోశ్ యాదవ్ అందించిన సేవలు అభినందనీయమని యాదవులు, ప్రజలు తెలిపారు. మండలంలోని ఇందారం గ్రామంలో గురువారం వారిని సన్మానించారు. నాయకులు కొరివి కత్తరశాల, రాజన్న, రమేశ్, కంకటి కత్తరశాల, ఓదెలు, లక్ష్మణ్, మల్లేశ్, రాయలింగు, తిరుపతి తదితరులు పాల్గొన్నారు.

ముగిసిన అంగన్‌వాడీల శిక్షణ

భీమిని: కన్నెపల్లి మండలంలోని జన్కాపూర్ రైతువేదికలో అంగన్‌వాడీలకు గురువారంతో శిక్షణ ముగిసింది. గతమూడు రోజులుగా భీమిని, బెల్లంపల్లికి చెందిన 35 మంది టీచర్లకు చిన్నారులకు ఆటపాటలతో విద్యనందించేలా శిక్షణ ఇచ్చినట్లు సీడీపీఓ ఉమాదేవి, ఐసీడీఎస్ సూపర్‌వైజర్లు రమాదేవి, మమత తెలిపారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ టీచర్లు పాల్గొన్నారు.

విద్యార్థులను పాఠశాలలో చేర్పించిన పోలీసులు

జైపూర్: ఆపరేషన్ ముస్కాన్‌లో భాగంగా మండలంలోని పౌనూర్ పాఠశాలలో కొన్నిరోజులుగా గైర్హాజరవుతున్న విద్యార్థులను బడిలో చేర్పించినట్లు జైపూర్ అదనపు ఎస్సై నాగరాజు తెలిపారు. పోలీసు సిబ్బంది గురువారం మైత్రి, సుమనశ్రీ, శివకుమార్, అభిషేక్, సాయికృష్ణ, అఖిలాష్ ఇంటికెళ్లి తల్లిదండ్రులతో మాట్లాడారు. పిల్లలను పాఠశాలకు రెగ్యులర్‌గా పంపించాలని చెప్పి బడిలో చేర్పించారు.

14న ఉచిత వైద్యశిబిరం

మంచిర్యాలటౌన్: మంచిర్యాల వికాస తరంగిణి, జెట్ హెల్పింగ్ హాండ్స్ ఆస్ట్రేలియా మెల్బోర్న్ సహకారంతో పాతమంచిర్యాలలోని ప్రభుత్వ ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో ఈనెల 14న ఉచిత వైద్యశిబిరం నిర్వహించనున్నట్లు నిర్వాహకులు ఓ ప్రకటనలో తెలిపారు. ఉదయం 8 గంటలకు ప్రారంభమయ్యే శిబిరంలో రొమ్ము, గర్భసంచి పరీక్షలు నిర్వహిస్తారని పేర్కొన్నారు. స్థానిక ప్రజలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

ఉట్నూర్‌కు తరలిన మండలవాసులు

మంచిర్యాలరూరల్(హాజీపూర్): ఆదిలాబాద్ జిల్లా ఉట్నూర్‌లో గురువారం రైతుభరోసా పథకంపై ఉమ్మడి జిల్లాస్థాయి విస్తృత సమావేశం జరిగింది. మంచిర్యాల జిల్లా హాజీపూర్ మండలం నుంచి కాంగ్రెస్ నేతలు, కార్యకర్తలు, రైతులు వాహనాల్లో ఉట్నూర్‌కు తరలివెళ్లారు. సమావేశంలో తమ అభిప్రాయాలను తెలియజేశారు.

చెత్తాచెదారం తొలగించాలి



కమిషనర్‌కు వినతిపత్రం అందిస్తున్న తల్లిదండ్రులు

మంచిర్యాలటౌన్: జిల్లాకేంద్రంలోని మైనార్టీ గురుకుల పాఠశాల చుట్టూపక్కల ఉన్న పిచ్చిమొక్కలు, పేరుకుపోయిన చెత్తాచెదారం తొలగించేలా చర్యలు చేపట్టాలని విద్యార్థినుల తల్లిదండ్రులు కోరారు. గురువారం ఈ మేరకు మున్సిపల్ కమిషనర్ మారుతిప్రసాద్‌కు వినతిపత్రం అందించారు. వర్షాకాలంలో సీజనల్ వ్యాధులు ప్రబలే అవకాశం ఉందన్నారు. ఇప్పటికైనా చెత్తాచెదారం తొలగించి, నీరు నిల్వ లేకుండా చూడాలని కోరారు. తాజొద్దీన్, బాబుఖాన్, రజాక్, గాజి, యూనుస్ ఉన్నారు.